సంక్రాంతి పండగ తెరపై చూస్తారు

'చాలా విరామం తర్వాత నేను నటించిన మాస్ సినిమా ఇది. నా గత చిత్రాలతో పోల్చితే యాక్షన్ ఘట్టాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సంక్రాంతి సీజన్‌లో పర్‌ఫెక్ట్ మూవీ అని చెప్పొచ్చు' అన్నారు అగ్ర హీరో నాగార్జున. ఆయన నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకుడు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం నాగార్జున పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..

ఈ సినిమాలో సంక్రాంతి ప్రభల తీర్థం నేపథ్యాన్ని చూపించబోతున్నారని తెలిసింది?

భోగి, సంక్రాంతి, కనుమ.. ఈ మూడు రోజుల్లో జరిగే కథ ఇది. 1980 నేపథ్యంలో నడుస్తుంది. తెరపై సంక్రాంతి పండగను చూస్తున్న అనుభూతి కలుగుతుంది. కథాంశం తగినట్లు సంక్రాంతి రోజున విడుదల కావడం ఆనందంగా ఉంది.

మీ కెరీర్‌లో చాలా వేగంగా పూర్తి చేసుకున్న చిత్రమిదే అంటున్నారు?

అలాంటిదేమీ లేదు. కేవలం 35 రోజుల్లోనే పూర్తయిన నా చిత్రాలు చాలానే ఉన్నాయి. 'నా సామిరంగ' 72 రోజులు పాటు షూటింగ్ జరుపుకుంది. నేను అరవై రోజుల పాటు పనిచేశాను. అయితే షూటింగ్ డేట్ మొదలుకొని రిలీజ్ డేట్ వరకు పక్కా ప్రణాళికతో వేగంగా పూర్తి చేసిన సినిమా మాత్రం ఇదే.

ఈ తరహా సినిమాలు మీరు గతంలో చేశారు. ఇందులో మీ పాత్రకున్న ప్రత్యేకతలు ఏమిటి?

ఈ సినిమాలో నా పాత్ర పేరు కిష్టయ్య. అతను స్నేహం కోసం ఎంత వరకైనా వెళ్తాడు. హీరోయిన్ ఆషికా రంగనాథ్‌తో నాకో ప్రేమకథ కూడా ఉంటుంది. దర్శకుడు విజయ్ బిన్నీ కొరియోగ్రాఫర్ కావడం వల్ల పాటలోనే కథను చెప్పే మంచి నేర్పు ఉంది. ఆయనలోని ఈ ప్రతిభ నచ్చే దర్శకుడిగా అవకాశమిచ్చాను. నా స్నేహితులుగా అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు.

ఈ కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలేమిటి?

మలయాళ మూల కథకు తెలుగు నేటివిటీకి అనుగుణంగా చాలా మార్పులు చేసి ఈ సినిమాను తెరకెక్కించాం. ముగ్గురు మిత్రులస్నేహబంధం చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో ప్రేమ, త్యాగం, నమ్మకం..ఇలా అన్ని అంశాలుంటాయి. హృదయాన్ని కదిలించే ఎమోషన్స్‌తో కూడిన అద్భుతమైన కథ.

మీ తదుపరి చిత్రాల గురించి..?

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఈ నెలాఖరులో షూటింగ్ మొదలవుతుంది. ఆ తర్వాత కొత్త దర్శకుడితో యాక్షన్ సినిమా చేయబోతున్నా. 'పఠాన్' తరహాలో సాగే డిఫరెంట్ యాక్షన్ జోనర్ చిత్రమది.

రకుల్‌ప్రీత్‌సింగ్

కలల వెంట పరుగు

కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగిందీ పంజాబీ భామ రకుల్‌ప్రీత్‌సింగ్. ముఖ్యంగా తెలుగులో అగ్ర హీరోలతో నటించి టాప్ లీగ్‌లోకి దూసుకుపోయింది. ఆ తర్వాత ఏమైయిందో కానీ ఒక్కసారిగా రేసులో వెనకబడింది. ఆ తర్వాత బాలీవుడ్ వైపు అడుగులు వేసి అక్కడ కొన్ని కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాల ద్వారా సత్తా చాటే ప్రయత్నం చేసింది. అయితే నటిగా ఈ అమ్మడి పర్‌ఫార్మెన్స్‌కు పేరొచ్చింది కానీ సినిమాలు ఆశించిన విజయాలను సాధించలేకపోయాయి. ప్రస్తుతం ఈ సొగసరి కెరీర్ ఆశాజనకంగానే ఉంది. తమిళ, హిందీ ఇండస్ట్రీలలో భారీ సినిమాల్లో నటిస్తున్నది. ఇటీవలే ఈ భామ బాలీవుడ్‌లో పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. 'యారియాన్' (2013) ఆమె తొలి హిందీ చిత్రం. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఈ సినిమా పోస్టర్‌ను షేర్ చేస్తూ అభిమానులకు, పరిశ్రమకు కృతజ్ఞతలు తెలిపింది. ఎన్నో అందమైన కలలతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టానని, స్వశక్తిని నమ్ముకొని ఈ స్థాయికి వచ్చానని రకుల్‌ప్రీత్ సింగ్ పేర్కొంది. భవిష్యత్తులో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, కలల వెంట పరుగు ఆపేది లేదని ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేసిందీ భామ. రకుల్‌ప్రీత్ సింగ్ నటించిన తమిళ చిత్రం 'అయలాన్' శుక్రవారం విడుదలైంది.

నాకు హీరో చేతిలో చావు దెబ్బలే!

షారుక్ ఖాన్ వరుస విజయాలతో జోరుమీదున్నారు. నిరుడు మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించారు. 2023లో గూగుల్‌లో సెర్చ్ చేసిన టాప్ 10 సినిమాల జాబితాలో షారుక్ నటించిన 'జవాన్', 'పఠాన్' ఉండటం విశేషం. తాజాగా ఆయన ఓ అవార్డు ఫంక్షన్‌లో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'నేను చాలా వరకు ఆశాజనకమైన, సంతోషకరమైన కథలే ఎంపిక చేసుకుంటాను. నా సినిమాల్లో హీరో పాత్ర మంచి పనులు చేస్తూ ఆదర్శంగా ఉంటుంది. నేను నెగెటివ్ పాత్ర పోషిస్తే హీరో చేతిలో చావుదెబ్బలు తప్పవు. చెడుపై ఎప్పటికైనా మంచే గెలుస్తుంది కదా' అని చెప్పారు. 30 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న షారుక్ తొలినాళ్లలో కొన్ని నెగెటివ్ రోల్స్ చేశారు. తర్వాత రొమాంటిక్ సినిమాలను ఎంచుకొని స్టార్ హీరో అయ్యారు.

వేసవిలో కల్కి ఆగమనం

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' నిర్మాణ దశ నుంచే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. భారతీయ పౌరాణిక ఇతిహాసాల స్ఫూర్తితో ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికాపడుకోన్ వంటి అగ్ర తారలు ఈ సినిమాలో భాగం కావడంతో దేశ వ్యాప్తంగా క్రేజ్ ఏర్పడింది. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయబోతున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ 'మే నెల 9వ తేదీ మా సంస్థకు సెంటిమెంట్. మేము తెరకెక్కించిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' 'మహానటి' 'మహర్షి' చిత్రాలు అదే తేదీన విడుదలైన అపూర్వ ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్నాయి. ఆ సెంటిమెంట్‌ను పునరావృతం చేస్తూ 'కల్కి' చిత్రాన్ని వేసవిలో విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నాం' అన్నారు. కొద్ది మాసాల క్రితం విడులద చేసిన ఈ చిత్ర టీజర్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది.

'ధీర' మాస్ యాక్షన్

లక్ష్

లక్ష్ చదలవాడ ప్రస్తుతం మంచి కమర్షియల్ సబ్జెక్ట్‌తో రాబోతున్నారు. 'వలయం', 'గ్యాంగ్‌స్టర్ గంగరాజు' వంటి సినిమాల తర్వాత లక్ష్ చేస్తున్న మరో చిత్రం 'ధీర'. శ్రీతిరుమల తిరుపతి వేంకటేశ్వర బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. మాస్, యాక్షన్ హీరోగా లక్ష్ ఆకట్టుకోనున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. షూటింగ్, సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 2న విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్ర ప్రధాన తారాగణం: లక్ష్, నేహా పఠాన్, సోనియా బన్సాల్, మిర్చి కిరణ్ తదితరులు; సంగీతం: సాయి కార్తీక్; నిర్మాత: పద్మావతి చదలవాడ; రచన-దర్శకత్వం: విక్రాంత్ శ్రీనివాస్.

అనూహ్య మలుపుల 'తంత్ర'

అనన్య నాగళ్ల

అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి, సలోని, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్ ముఖ్యపాత్రల్లో నటించిన సినిమా 'తంత్ర'. ఫస్ట్ కాపీ మూవీస్, బీ ద వే ఫిల్మ్స్, వైజాగ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్లపై చిత్రీకరించిన ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌ను కథానాయిక పాయల్ రాజ్‌పుత్, అనసూయ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. 'గతంలో ఎన్నో అద్భుతమైన పాటలు పాడిన అనురాగ్ కులకర్ణి గారు ఈ సాంగ్ పాడటం చాలా ప్లస్ అయింది. టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తంత్ర రహస్యమేమిటన్నది ఉత్కంఠను పంచుతుంది. కథలోని మలుపులు ఆకట్టుకుంటాయి. త్వరలో ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అన్నారు. ఈ సినిమాకు కెమెరా: సాయిరాం ఉదయ్, విజయ్ భాస్కర్ సద్దాల; సంగీతం: ఆర్‌ఆర్ ధృవన్; సాహిత్యం: అలరాజు; నిర్మాతలు: నరేశ్‌బాబు పి, రవిచైతన్య; రచన-దర్శకతం: శ్రీనివాస్ గోపిశెట్టి.